క్లుప్తంగా

సార్వత్రిక సమ్మె వాయిదా

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినట్లు సీటీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సార్వత్రిక సమ్మెను వచ్చేనెల జూన్ 9వ తేదిన నిర్వహించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయని, స్థానిక కార్మిక సంఘాలు గమనించి వచ్చే నెల 9న జరగబోయో సార్వత్రిక సమ్మెలో భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడిరెక్క మల్లయ్య, గుణగంటి రాంచంద్రు, బొచ్చుకోటి రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిదత్త ఆశ్రమ వార్షికోత్సవం



సాయిదత్తాశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే కాలనీ సమీపంలోని శ్రీసాయి దత్తాశ్రమంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నాగసాయి, దత్తాత్రేయ విగ్రహాలకు పంచామృతాభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పట్టణ పరిసరాల నుంచి భక్తులుపెద్ద ఎత్తున తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్,, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, విక్రం, వాసు, అంజిబాబు, పద్మ, సీత, శారధ, కల్యాణి, భవానీ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గుర్రంపోడు : మండలంలోని నడికూడ గ్రామంలో శుక్రవారం వంటిద్దు సంజీవరెడ్డి అనే రైతుకు చెందిన ఆవు మేత మేస్తూ ట్రాన్స్ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైర్ తగిలి మృతిచెందింది. సుమారు 70 వేల నష్టం జరిగిందని, తనకు నష్ట పరిహారం చెల్లించాలని అధికారులను కోరారు.

పెద్దవూర తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



పెద్దవూర : మండల తహసీల్దార్‌గా జె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెద అడిశర్లపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం. శ్రీనివాసులు బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అక్రమ నిర్మాణం ఆపాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కలాల్‌వాడలో సిమెంటు రోడ్డును మారం శ్రీనివాస్ అనే వ్యక్తి ఆక్రమించుకొని గదులను నిర్మిస్తున్నారని, ఈ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు కలాల్‌వాడీ ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానికుడు జైనీ రాంమోహన్‌రావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి వినియోగించిన సిమెంటు రోడ్డును ఆక్రమించుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని, ఈ నిర్మాణంతో ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని, ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే కొంత కాలం పాటు నిర్మాణం నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని కమిషనర్‌ను కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో గుండా రమేష్, వెంకటమ్మ, మధన్, దుర్గయ్య, రాంబాబు, లక్ష్మి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పుష్పలత, కస్తూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కో రుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని 20వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, పారిశుద్ధ్య సమస్య సైతం ప్రజలను వేధిస్తుందన్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చాలని ఆయన కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు నేతాళ్ల వెంకటేష్, గుండాల అంజయ్య, సముద్రాల సహదేవుడు, కుంభం తిరుపతిగౌడ్, శంకరయ్య, గణేష్, తదితరులున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్!

- కొండమల్లేపల్లిలో వరుస దొంగతనాలు
- ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే ఆలోచిస్తున్న ప్రజలు
- పగలు గస్తీ పెంచాలని కోరుతున్న పట్టణవాసులు



ఇటీవల ఓ ఇంట్లో చోరీ జరగడంతో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో పట్టపగలే దొంగలు చోరీలకు తెగబడుతున్నారు. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. వారం తిరగకముందే వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రం నాలుగు రోడ్ల చౌరస్తా కావడం ముఖ్యంగా హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వరకు రాష్ట్ర రహదారి, జడ్చర్ల – కోదాడ వరకు 167 జాతీయ రహదారి ఈ పట్టణ కేంద్రం గుండా వెళ్లడంతో నిత్యం రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల కొత్త కొత్త వ్యక్తులు పట్టణానికి చేరుకొని ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్నారు. మే 7 నుంచి 14వ తేదీ వరకు వారం వ్యవధిలో పట్టపగలే తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు జరగడంతో ప్రజలు వేసవి సెలవుల్లో ఎక్కడికైన వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కూడా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో రూ.2లక్షల విలువ చేసే సెంట్రింగ్ బాక్స్‌ల దొంగతనం, ఈనెల 14న పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరగడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదంతా కూడా కొత్త కొత్త వ్యక్తులు పట్టణంలో సంచరించడమే నని పలు అనుమానాలకు తావిస్తోంది.

భయాందోళనలో పట్టణవాసులు

వరుస చోరీలు జరగడం... అందులో పట్టపగలే తాళం వేసి ఉన్న ఇళ్లల్లోనే చోరీలు జరగడం పట్టణవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లల్లో చోరీలు మాత్రమే కాకుండా ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగలించడం బస్టాండులో సెల్ ఫోన్‌లు దొంగలించడం ఇటివంటి ఘటనలు పట్టణంలో వరుసగా జరగడంతో ప్రజలకు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలకు ఇళ్లకు తాళాలు వేసి వేసవి సెలవుల్లో శుభ కార్యాలకు, విహార యాత్రలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఒక వేళ ఇంటికి వెళ్లినా తిరిగి వచ్చే సరికి ఏ విధమైన చోరీలు జరుగుతాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాలు ఉన్నా..

పట్టణ కేంద్రంలో మొత్తం 36 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. దొంగతనాలు చేసే వ్యక్తులు ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయో వాటిని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా ఆలోచించి దొంగతనాలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు అంతుచిక్కడం లేదు. సీసి కెమెరాలతో పాటు పోలీసుల గస్తి కూడా ఎంతైనా అవసరం ఉంది. సీసీ కెమెరాల ద్వారా అనుమానంగా తిరిగే కొత్త వ్యక్తులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసుల తీరుపై అసహనం

వరుస చోరీలు పట్టపగలే జరుగుతుండడంతో పోలీసుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు భద్రత కల్పించాల్సిన పోలీసులు కేసులను చేధించడంలో విఫలం అవుతున్నారని పోలీసుల పెట్రోలింగ్ పరిధిని రాత్రితో పాటు పగలు కూడా పెంచాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

పోలీస్ నిఘా పెంచాం

కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో పట్టపగలే వరుస చోరీలు జరుగుతుండడంతో పోలీసు నిఘా పెంచాం. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేయాలని సిబ్బందికి సూచించాం. రాత్రి గస్తి పెంచడంతో పాటు పగలు గస్తి కూడా ప్రత్యేకంగా చేస్తున్నాం. పట్టణంలో కొత్త వ్యక్తుల అలజడిని పసిగట్టి త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. ప్రజలు కొత్త వ్యక్తులను గుర్తించినట్లయితే పోలీసు వారికి సమాచారం అందించాలి.

-రాజు, ఇన్‌చార్జ్ సీఐ, కొండమల్లేపల్లి

బ్యూటిఫికేషన్ రౌండ్ వెడల్పు తగ్గించాలి



తడకమళ్ల క్రాస్‌రోడ్డు వద్ద ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ : పట్టణంలోని నల్లగొండ చౌరస్తా, తడకమళ్ల క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించిన బ్యూటిఫికేషన్ రౌండ్ వెడల్పుగా ఉన్నందున వచ్చిపోయే వాహనాలకు ఇరుకుగా ఉందని అధికారులు వెంటనే వెడల్పు తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలగాని వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ కూడలి వద్ద నిర్మించిన బ్యూటిఫికేషన్ కూడలి వెడల్పుగా ఉండడంతో రోడ్డు ఇరుకుగా ఉందని, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి వెంటనే బ్యూటిఫికేషన్ రౌండ్ వెడల్పు తగ్గించి ప్రమాదాలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండు నరేందర్‌గౌడ్, చౌగాని వెంకన్నగౌడ్, గాదగోని మహేష్‌కుమార్‌గౌడ్, పులి విద్యాసాగర్‌గౌడ్, అంతటి రాములు, దోరేపల్లి రాములు, తెల్లపల్లి వెంకటేశ్వర్లు, పులి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని శాపంగా భావించొద్దు



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్

మిర్యాలగూడ : తల్లిదండ్రులు తమ పిల్లల అంగవైకల్యాన్ని శాపంగా భావించకుండా ఆదరించి పిల్లల మానసిక, శారీరక వికాసానికి దోహదపడాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి పత్యానాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. భవిత కేంద్రాన్ని ఆధునీకరించడానికి అవసరమయ్యే ర్యాంప్ రోలింగ్, ఎలక్ట్రిఫికేషన్ గ్రిల్స్, ప్రత్యేక అవసరాల కోసం పిల్లలకు ఉపయోగపడే ఆధునీక మరుగుదొడ్లను నిర్మించడానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే విద్య అందుతుందని, ఫిజియోథెరపీ డాక్టర్ ద్వారా పిల్లలకు రెగ్యులర్‌గా అందించబడే చికిత్సను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ టీచర్స్ రవి, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

ధరలను నియంత్రించడంలో విఫలం



మాట్లాడుతున్న ఉస్తెల సృజన

మిర్యాలగూడ అర్బన్ : నిత్యావసర ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో సుందరాంగులకు కాళ్లు కడిగించడం తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు ఎర్రబోతు పద్మ, షమీం, శాంతి, సీపీఐ నాయకులు ఎండీ. సయ్యద్, లింగానాయక్, యాదగిరి, ఉదయ్‌కుమార్, ప్రమీల, మమత, సైదమ్మ, కోటమ్మ, శైలజ, రజియా, సీత, పద్మ పాల్గొన్నారు.

సహకార సంఘం భూమి విక్రయించొద్దని ఆదేశం



అధికారి జారీ చేసిన ఆదేశ పత్రాన్ని చూపుతున్న చిన్నపాండు , తదితరులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ సహకార సంఘం గతంలో కొనుగోలు చేసిన భూమిని జిల్లా సహకార శాఖ అనుమతి లేకుండా విక్రయించొద్దని జిల్లా సహకార శాఖ అధికారి పత్యానాయక్ ఆదేశాలు జారీ చేసినట్లు ఐఎన్‌టీయూసీ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు ధనావత్ చిన్నపాండు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని వెంకటాద్రిపాలెం ఇండస్ట్రీయల్ కాలనీ సమీపంలోని కార్మిక సంఘం భూమిని పరిశీలించి మాట్లాడారు. గతంలో కొనుగోలు చేసిన భూమిని కార్మిక సంఘం సభ్యులు అనుమతి లేకుండా విక్రయించినట్లు తను జిల్లా కలెక్టర్‌కు, జిల్లా సహకారశాఖ అధికారికి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన అధికారులు భవిష్యత్‌లో భూములను అమ్మేందుకు కార్మిక సంఘానికి అవకాశం లేకుండా ఆదేశాలు ఇచ్చారన్నారు. హమాలి కార్మిక సంఘం భూములను ఇకమీదట ఎవరికి కొనుగోలు చేసే అవకాశం లేదన్నారు. గతంలో ఏకపక్షంగా జరిపిన అమ్మకాల విషయమై తాను మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధ్యులైన వారిపై కేసులను నమోద చేసి అరెస్ట్ చేశారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని ఎఫ్‌సీఐ హమాలీ కార్మిక సంఘం భూముల అమ్మకాల విషయాన్ని అధికారులు సమగ్ర విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమంగా అమ్మకాలు చేపట్టిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, మాలోతు శంకర్, తులసీరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గుడిపల్లి ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం

నాగర్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో గురువారం లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం వివరాలు తెలిసినట్లు సాగర్ ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపారు. సాగర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం హైదరాబాద్ తార్నాకకు చెందిన సియాజుద్దీన్(58) వ్యాపారంలో కొంతకాలంగా నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో మనస్థాపానికి గురైన సీయాజుద్దీన్ నాగార్జునసాగర్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలిపారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డును సందర్శించి మాట్లాడారు. పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని, వాహనాలు వార్డుల్లోని ఇంటి వద్దకు వచ్చిన తరువాత తడి, పొడి చెత్త వేరు చేసి వేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట జవాన్లు తదితరులు ఉన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



హాలియా : రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపాసాగర్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు

మిర్యాలగూడ : రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామంలోని కృషి వి/్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెంలో ×రైతు ముంగిట్లో శాస్త్రవేత్త€లు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోని మంచి దిగుబడులు సాధించాలని, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు సాగునీటి సమర్థ వినియోగం, తక్కువ యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. విత్తనాల లభ్యత, పంట కోతలు, విత్తనాల కొనుగోలులో రశీదులను భద్రపరచడం, సమగ్ర పురుగు, తెగుళ్ల మందుల సద్వినియోగం, చెట్లు నాటడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, జిల్లా ఉద్యాన అధికారి అనంతరెడ్డి, నరసింహా, హెచ్ఎం అనంతరెడ్డి, మత్స్యశాఖ అధికారి కిశోర్, కృష్ణనాయక్, శ్రీనివాస్, చలపతిరావు, రాంబాబు, నరసింహా పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక లాభాలు

హాలియా : రైతులు లాభాలు పొందేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ కంపాసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీ రమ్య, స్వాతి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అనుముల మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సస్యరక్షణలో రసాయన, పురుగుల మందులను అవసరం మేరకే వాలన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. విత్తనాలు, పురుగు మందుల రశీదులు పంట పూర్తియ్యేలా భద్రం చేయాలని సూచించారు. అనంతరం రైతులకు సేంద్రియ వ్యవసాయం, సాగునీటి ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి, పచ్చిరొట్టె పైర్లు, అపరాల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సరిత, ఏఈఓ నాగయ్య, రిటైర్డ్ ఎంఈఓ కిసర యుగేందర్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

పింఛన్ ఇప్పించరూ!

- 60 ఏళ్లు నిండినా పింఛన్ వస్తలేదు..
- రేషన్‌కార్డు కూడా లేదని మరుగుజ్జు భారతి ఆవేదన



చందంపేట : పుట్టుకతోనే మరుగుజ్జు... 60ఏళ్లు దాటి వృద్ధాప్య జీవితం గడుపుతుంది. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలంలోని కలకొండ తండాకు చెందిన మరుగుజ్జు రమావత్ భారతి.. మరగుజ్జు కావడంతో ఎక్కడ పని దొరక్క... సొంత ఇల్లు అంటూ లేక నానా ఇబ్బందులు పడుతుంది. తమ్ముడి వద్ద శేష జీవితం గడుపుతున్న ఆమె పింఛన్ మంజూరు చేయాలని ఎన్నోమార్లు దరఖాస్తు చేసుకున్న బుట్టదాఖలైందని వాపోతుంది. పింఛన్ అందించాలని అధికారులకు మొరపెట్టుకుంటే చూస్తాం.. చేస్తామంటూ దాటేస్తున్నారే కాని కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. రమావత్ హన్య, గోచి దంపతులకు ఆరుగురు సంతానం కాగా నలుగురు మహిళలు, ఇద్దరుమగ సంతానం అందులో ఒక సంతానమే ఈ భారతి. కనీసం రేషన్ కార్డు కూడా మంజూరీ చేయడం లేదని, పింఛన్ ఇవ్వాలని అధికారులను వేడుకుంటుంది. ప్రస్తుతం కరువు పనికి పోతే వచ్చే డబ్బులతోనే జీవితం వెళ్లదీస్తున్నట్లు పేర్కొంది.

నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి



కంపోస్టు షెడ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

నిడమనూరు : వేసవిలో నర్సరీలను సక్రమంగా చేపట్టాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని బొకమంతలపాడు నర్సరీలను, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. పలు గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో చేపట్టనున్న హరితహారం నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు సక్రమంగా పెంచాలన్నారు. వేసవిలో వంద శాతం మొక్కలను సంరక్షించాలన్నారు. ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టాలని, ఉపాధి శ్రామీకులకు సరైన వేతనం వచ్చేలా వ్యవసాయ, గ్రామాల్లోని శాశ్వత పనులు చేపట్టాలని పీడీ శేఖర్ రెడ్డి సూచించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న ఉపాధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కార్యదర్శులకు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కంపోస్టు షెడ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని బొకమంతలపాడు కార్యదర్శికి సూచించారు. బొకమంతలపాడు నర్సరీ దగ్గరనే మండలంలోని పలు కార్యదర్శులకు, ఉపాధి సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నిడమనూరు ఎంపీడీఓ రమేశ్, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరిస్తున్న కమిషనర్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మిర్యాలగూడ టౌన్ : ప్రజా సమస్యలను విస్మరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వైఖరీపై శుక్రవారం బీజేపీ పట్టణ-1 ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ పాలక మండలి కాలం పూర్తి అయినప్పటి నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీని భ్రష్టు పట్టిస్తున్నాడని ఆరోపించారు. మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు విపరీతంగా నిర్మాణాలను జరుగుతున్నప్పటికీ వారి నుంచి ముడుపులు తీసుకొని ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది వేతనాలను చెల్లించడంలో కూడా వివక్షతను చూపిస్తున్నారన్నారు. ఏమైనా సమస్యలు కమిషనర్‌కు చెప్పుదామని వస్తే ఎప్పుడు కూడా అందుబాటులో ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, బీజేపీ వన్ టౌన్ అధ్యక్షులు బంటు గిరి, వన్ టౌన్ ప్రధాన కార్యదర్శులు కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, నక్క రవిబాబు, అభి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



గాంధీ చౌక్ వద్ద రక్షణ లేకండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



ప్రధాన రహదారి వద్ద..

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి.. ఎలాంటి రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, గాంధీ చౌక్ వద్ద, ప్రధాన రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ లేదు. జన సంచార ప్రాంతం కావడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



మిర్యాలగూడ : పట్టణ శివారులోని వైజంక్షన్ దాటిన అనంతరం నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్‌కు, స్తంభానికి తీగజాతి మొక్కలు అల్లుకోని ప్రమాదకరంగా మారింది. ప్రతి రోజూ విద్యుత్ అధికారులు ఆ వైపు నుంచి వెళ్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే రహదారి వెంట ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలు అల్లుకొని ఉండడంతో వేసవికాలంలో అవి ఎండి మంటలు వ్యాపించే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే ట్రాన్స్‌ఫార్మర్‌కు, స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.